# అయిపు

బి.పి.కరుణాకర్

**ఆఫీసు చేరుకుని నా గదిలోకి వెళ్లి అలా కూర్చున్నానో లేదో నా సెక్రటరీ వచ్చి, "మనం ఇంటర్‌వ్యూలకు పిలిచిన అభ్యర్థులు వచ్చారు. ఒక్కొక్కరిని పిలవమంటారా?" అడిగింది. మొదట్లో నా సెక్రటరీ నేను ఆఫీసుకు రాగానే విష్ చేసేది. ఇప్పుడు విష్ చేయడం మానేసింది. ఏదయినా అవసరం ఉండి పిలవగానే రావడం లేదు. సమయం తీసుకుంటోంది.**

అలవాటుగా మణికట్టు వంక చూసుకున్నాను. చేతి గడియారం లేదు. రాత్రి తాగినప్పుడు ఎక్కడ పడిపోయిందో? లేదా ఇంట్లో ఎక్కడ పెట్టి మర్చిపోయానో? లోగడ నాలుగయిదు గడియారాలు తాగి పోగొట్టుకున్నాను. ఎదురుగా ఉన్న గోడ గడియారం వంక చూశాను. పదకొండూ నలభయి అయింది. ఈ ఇంటర్‌వ్యూలు ఉండడం వలన ఆఫీసుకు వచ్చాను. లేకుంటే కుమార్‌తో కలిసి ఫాంహవుస్ వెళ్లుండేవాడిని. కుమార్ నాకు పదిహేను సంవత్సరాల నుండి తెలుసు. నాకు మంచి శత్రువయినా వదలకుండా మిత్రులుగా ఉంటున్నాం. రాత్రి ఎక్కువగా తాగటం వలన హేంగోవరుతో తల నొప్పిగా ఉంది. ఉదయం నుండి ఏమీ తినక పోవడం వలన ఆకలిగా ఉంది. రాత్రి కూడా భోజనం సహించలేదు. నాలుగయిదు ముద్దలు తిని వదిలిపెట్టేశాను. ఈ తలనొప్పి తగ్గాలంటే రెండు పెగ్గులు తీసుకోవాలి.



కుడిచేతి వేళ్లతో కణతలు నొక్కుకుంటూ, "ఎంతమంది వచ్చారు?" అడిగాను.

"ఆరుగురు" అంది.

"అరగంట తర్వాత ఒక్కొక్కరిని నా గదిలోకి పంపించు".

వచ్చినవాళ్ల లిస్టు నాకు అందించి వెళ్లిపోతుంటే, "మాట" అన్నాను.

ఆగింది.

"నాకు ఆకలిగా ఉంది. ఎవరినయినా పక్కనే ఉన్న హోటలుకు పంపించి టిఫిన్ ఏదయినా తెప్పించగలవా?" జేబులోంచి వంద రూపాయల నోటు తీసి ఆమెకందించాను.

తీసుకుని, "ఏం తెప్పించమంటారు?" అడిగింది.

"ఏవయినా పర్వాలేదు".

**కథ**

ఆమె వెనక తలుపు మూసుకోగానే బల్ల సొరుగులోంచి స్కాచ్ సీసా తీసి గ్లాసు అందుకుని రెండు పెగ్గులు పోసి నీళ్లు నింపి గటగటా తాగేశాను. సీసా మూత గట్టిగా బిగించి సొరుగులో పెట్టి సిగరెట్ వెలిగించాను. మందు కదులుతోంది. మత్తు అందుకోలేదు. మా కంపెనీలో ఒకప్పుడున్నంత మంచిపేరు నాకు ఇప్పుడు లేదు. చిన్నా చితకా పనులు తప్ప పెద్ద పనులు నా వరకు రావు. చాలా విషయాలు నాకు చెప్పరు. నాతో ఎక్కువగా మాట్లాడరు. మా మామగారు, బావమరదులే అన్ని పనులు చూసుకుంటారు. మొదట్లో ఇల్లరికం ఎంతో ఆనందంగా ఉండేది. ఇప్పుడేమీ లేదు. బందీని. నాకు నేను చేసుకున్నదే.

టిఫిన్ తిన్నాక ప్రాణం కుదుట పడింది. అభ్యర్థులను ఒక్కొక్కరినే లోపలకు పంపించమని చెప్పి జాబితా చేతుల్లోకి తీసుకున్నాను. నిజానికి ఈ ఇంటర్‌వ్యూలు ఒక తంతు మాత్రమే. పిలిపించమన్నారు. పిలిపించాను. ఒకప్పుడు మా కంపెనీకి చాలా మంచి పేరుండేది. మార్కెట్‌లో మా ప్రాడక్ట్స్‌కు తిరుగుండేవి కావు. రాజకీయ జూదంలో మా మామగారు తల దూర్చేసరికి ఎదురుచూడని భారాలు వచ్చాయి. తట్టుకోవటం కష్టమయింది. పార్టీలు మార్చినా లాభం లేకపోయింది. నష్టాల ఊబిలో కూరుకోక పోయినా లాభాలు మటుకు అంతంతమాత్రంగా ఉన్నాయి. ఈ ఒడిదుడుకులకు కారణం నేనని ముద్ర వేశారు. నిజానికి నా పాత్ర ఇందులో ఏమీ లేదు. ఇప్పటికీ మించిపోయింది ఏమీ లేదు. మూసివేసిన రెండు యూనిట్లను తెరిపించి కొద్దిగా మార్పులు చేయగలిగితే వ్యాపారం పుంజుకుంటుంది. నా మాట ఎవరూ వినరు.

ఇంటర్‌వ్యూల తతంగం పూర్తి చేసేసరికి గంట దాటింది. ∴నిలో మునిగిపోయాక తలనొప్పి పూర్తిగా తగ్గి మనసు ప్రశాంతమయింది. కుర్చీలోంచి లేచి ఒళ్లు విరుచుకుని కిటికీ దగ్గిరకు నడిచి బయటకు చూశాను. వాతావరణం చల్లగా ఉంది. కిటికీలోంచి గాలి నన్ను తోసుకువస్తోంది. సెల్ మోగింది. అందుకుని చూశాను. నా భార్య నుండి వచ్చింది.

"చెప్పు" అన్నాను.

"ఇంటర్‌వ్యూలు అయిపోయాయట" అంది.

నేను చేసే ప్రతిపని గురించిన సమాచారం ఎప్పటికప్పుడు ఆమెకు చేరిపోతుంటుంది.

"ఇప్పుడే అయిపోయాయి".

"నేనిప్పుడు గుంటూరులో ఉన్నాను. నేనొక్కదానినే కాదు. మన పిల్లలు, నాన్న, అమ్మ అన్నయ్యలు అందరూ ఇక్కడే ఉన్నాం'.

"ఏమిటి విశేషం?"

నా చిన్నప్పుడు మా ఊళ్లో హైస్కూలు లేదు. ఏడు మైళ్ల దూరంలో ఉండేది. రానూ పోను హైస్కూలు వెళ్లటానికి పధ్నాలుగు మైళ్లు నడవాల్సి వచ్చేది. అప్పట్లో నేను బలహీనంగా ఉండేవాడిని. రోజూ అంత దూరం నడవడానికి కష్టపడేవాడిని. అప్పుడప్పుడు రాత్రుళ్లు కాళ్లు విపరీతంగా నొప్పిపుట్టేవి. అమ్మ నా కాళ్లకు తైలం రాసి ఓపికగా కాళ్లు వత్తేది. కొన్నిసార్లు నొప్పి భరించలేక ఏడుస్తుంటే అమ్మ కళ్లల్లో కూడా నీళ్లు తిరిగేవి.



"మా తాతయ్యగారి పుట్టినరోజు".

"ఇప్పుడా చెప్పడం?"

"ఈ కార్యక్రమం గురించి రాత్రి మీతో చెబుదామనుకుంటే మీరు మీ లోకంలో ఉండిపోయేసరికి చెప్పలేదు. వేరే పనులు ఏమున్నా అవన్నీ పక్కన పడేసి ఉన్నపళంగా బయల్దేరి గుంటూరు రండి. అందరూ వచ్చారు. మీరు రాకుంటే బావుండదు" నా జవాబుకై ఎదురుచూడకుండా కట్ చేసింది. ఆవిడ పక్కనే ఎవరో ఉండి ఉంటారు. అంచాత నాతో మర్యాదగానే మాట్లాడింది. లేకుంటే నన్ను 'మీరు' అని సంబోధించదు.

కుర్చీలో కూర్చుని సిగరెట్ వెలిగించాను. నేను గుంటూరు వెళ్లాలి. వెళ్తున్నాను. వెళ్లకపోతే నా భార్య ఎంత రాద్ధాంతం చేస్తుందో నేనూహించగలను. నా జీవితం నాకే గమ్మత్తుగా ఉంది. బల్ల సొరుగులోంచి సీసా మళ్లీ బయటకు తీశాను. రెండు పెగ్గుల పయినే ఉంటుంది. గ్లాసు అందుకుని సీసా ఖాళీ చేసి గ్లాసునిండా నీళ్లు నింపి గటగటా తాగి, సీసా, గ్లాసు సొరుగులో పెట్టి సొరుగు మూశాను. బల్లకు తాళం వేసి కుర్చీలో చేరగిలబడి కూర్చుని సిగరెట్ తాగుతున్నాను. ఆకలి వేస్తోంది. కళ్లు మూసుకున్నాను.

సిగరెట్ చివరంటా కాలి చేతివేళ్లు చురుక్కుమనేసరికి కళ్లు తెరిచి సిగరెట్ పీకను కిటికీలోంచి బయటకు విసిరి కుర్చీలోంచి లేచి నిలబడుతుండగా తలుపు తెరుచుకుని కారుడ్రైవరు లోపలికి వచ్చాడు. నన్ను గుంటూరు తీసుకురమ్మని అతనికి ఆజ్ఞ అయి ఉంటుంది.

కిందకొచ్చి కారులో కూర్చున్నాక మత్తు ఎక్కడం మొదలయింది. కారు బయల్దేరాక చల్లటి గాలికి కళ్లు మూతలు పడసాగాయి. విజయవాడ దాటాక ఆకలి ఎక్కువవుతున్నట్లు అనిపించసాగింది. కడుపులోని మందు ఇబ్బంది పెడుతోంది. ఏదయినా తిని ఉంటే బావుండేది. నిద్ర ఎగిరిపోయింది. దారిలో మంచి టిఫిన్ సెంటర్ ఏదయినా కనబడుతుందేమోనని కిటికీలోంచి చూస్తుంటే రోడ్డు పక్కగా నడుచుకుంటూ ఇందాక ఇంటర్వ్యూకు వచ్చిన కుర్రాడు కనిపించాడు. చేతిలో సన్నటి ఫైలు ఉంది.

"డ్రైవర్, కారాపు" అన్నాను. నా మాటలు ముద్దగా ఉన్నట్టు నాకే అనిపించాయి.

కొద్దిగా ముందుకు తీసుకువెళ్లి డ్రైవర్ కారాపాడు.

"ఆ కుర్రాడిని పిలు".

డ్రైవరు ఇంజనాపి కారు తలుపు తెరుచుకుని దిగవెళ్లేలోగా ఆ కుర్రాడే కారు దగ్గిరకు వచ్చాడు. తలుపు తెరిచి "ఎక్కడివరకు వెళ్లాలి?" అడిగాను. తాగినప్పుడు భూతదయ కలుగుతుంటుంది.

"గుంటూరండీ" అన్నాడు.

"కూర్చో. నేనూ గుంటూరే వెళ్తున్నాను".

నా పక్కనే కూర్చోడానికి సంకోచపడుతుంటే, "రావయ్యా... కూర్చో..." విసుగు ధ్వనించకుండా అన్నాను. తటపటాయిస్తూనే కారులో కూర్చుని, తలుపు మూశాక కారు కదిలింది.

"నీ పేరు?" అడిగాను.

"రాఘవులు. సుబ్బ రాఘవులు... మీ ఆఫీసులో మీరు జరిపిన ఇంటర్వ్యూలో నేనున్నాను..."

"గుర్తుపట్టే కారాపించాను".

"సెలక్ట్..." అంటుంటే అతని మాటలకు అడ్డు తగిలి "విజయవాడ నుండి నడిచే వస్తున్నావనుకుంటాను" అన్నాను.

తలూపాడు. అతని ముఖం అమాయకంగా ఉంది. నా చిన్నప్పుడు మా ఊళ్లో హైస్కూలు లేదు. ఏడు మైళ్ల దూరంలో ఉండేది. రానూ పోను హైస్కూలు వెళ్లటానికి పధ్నాలుగు మైళ్లు నడవాల్సి వచ్చేది. అప్పట్లో నేను బలహీనంగా ఉండేవాడిని. రోజూ అంత దూరం నడవడానికి కష్టపడేవాడిని. అప్పుడప్పుడు రాత్రుళ్లు కాళ్లు విపరీతంగా నొప్పిపుట్టేవి. అమ్మ నా కాళ్లకు తైలం రాసి ఓపికగా కాళ్లు వత్తేది. కొన్నిసార్లు నొప్పి భరించలేక ఏడుస్తుంటే అమ్మ కళ్లల్లో కూడా నీళ్లు తిరిగేవి. "స్కూలు ఫైనలు వరకు ఓర్చుకోరా. నువ్వు బాగా చదువుకుని పైకి వస్తే మా అందరికీ ఎంత సంతోషంగా ఉంటుందో తెలుసా?" అనేది. నేను స్కూలు ఫైనలు పూర్తి చేసిన తర్వాతగాని మా ఊరికి హైస్కూలు, కాలేజీలు రాలేదు. నా చదువు పూర్తి అయి, ఉద్యోగం దొరికాక మా వాళ్లకెవరికీ ఏమీ చేయలేకపోయాను. కనీసం మా తమ్ముళ్లకు మా కంపెనీలో ఉద్యోగాలు ఇప్పించలేకపోయాను. ఇప్పుడు వాళ్లెవ్వరూ నాతో మాట్లాడరు.

"ఇంటర్వ్యూకు వచ్చినవారికి రెండేసి వందల రూపాయలు ఇవ్వమన్నాను. నీకివ్వలేదా?" అడిగాను.

"ఇచ్చారండీ".

"ఇస్తే నడిచి ఎందుకు వెళ్తున్నావు?" అడిగి కళ్లు మూసుకున్నాను. ఆకలి ఎక్కువవుతోంది.

అతను వెంటనే జవాబు చెప్పలేదు.

రెండు నిమిషాలాగి మళ్లీ అదే ప్రశ్న వేశాను.

"నిజం చెప్తే మీరేమీ అనుకోరు కదా?"

కళ్లు తెరవకుండానే తల అడ్డంగా ఆడించాను.

"... ఒకప్పుడు మాది కొద్దో గొప్పో ఉన్న కుటుంబమే. మా నాన్న గారి వ్యసనాల వలన ఉన్నదంతా పోయింది. ఆయన చనిపోయి అయిదు సంవత్సరాలవుతోంది. అమ్మ, నేను, తమ్ముడు, చెల్లెలు మిగిలాం. నేను ట్యూషన్లు చెబుతుంటాను. నెలంతా కష్టపడితే పదిహేను వందల రూపాయలు కూడా రావు. నా సంగతి వదిలేయండి. నేను గాలి తిని బతుకుతాను. నా బాధంతా మా వాళ్లమీద... వాళ్లు ముగ్గురూ భోజనం చేసి రెండు రోజులవుతోంది..."

ఉలిక్కిపడ్డట్టు కళ్లు తెరిచాను. అతని కళ్లల్లో నీరు తిరుగుతోంది.

"... మీరిచ్చిన రానూపోనూ చార్జీల డబ్బులతో మా ఇల్లు కనీసం వారం రోజులపాటు గడిచి..." అతను మాట ముగించలేదు. నా కడుపులో తిరుగుతున్న ఆకలి మందు ప్రభావానికి తట్టుకోలేకపోయింది. వాంతవుతోంటే ఆపుకోలేకపోయాను. చేయి అడ్డం పెట్టుకున్నా అతనిమీద కూడా పడింది. సీట్లోకి ఒరిగిపోయాను.

మెలకువ వచ్చేసరికి నేను కూర్చున్న కారు పార్కింగ్ లాట్‌లో ఉంది. నేను వాంతి చేసుకుంది శుభ్రం చేసినట్టుంది. తడి ఇంకా ఆరలేదు. సుబ్బ రాఘవులు లేదు. మధ్యలో ఎక్కడో దిగిపోయి ఉంటాడు. నా గురించి ఏమని అనుకుని ఉంటాడో? డ్రైవర్ షామియానాలో కూర్చుని భోజనం చేస్తున్నాడు. అప్పుడు నాకు ఆకలి వేయలేదు. చచ్చిపోయింది. ●


**పూర్తిగా ఆశ్చర్యకరంగా అనుకున్నది నెరవేర్చే అద్భుత సిద్ధ ఉంగరం ఉచితం**

మీరు అనుకోకుండా ఏమైనా ఇబ్బందులలో చిక్కుకున్నా బాధపడవలసిన అవసరం లేదు. వెంటనే మా ఆశ్రమం ఉంగరం పొంది ధరించుట లేదా మీ వద్ద ఉంచుకొనుట ద్వారా ఇది మీరు కోరుకున్న పురుషుడు లేదా స్త్రీ మనసుని మీ వైపు ఆకర్షిస్తుంది. మీరు ఎవరి పేరు ఉచ్చరిస్తారో వారు ఎంతటి కఠిన హృదయం కలిగిన వారైనా మీ పాదాల చెంత దాసోహం అంటారు. ఇంకా వారు మీ ఇష్ట ప్రకారం వ్యవహరిస్తూ నడుచుకుంటారు. వ్యాపారంలో లాభాం, పరీక్షలలో విజయం, మనసుకు నచ్చిన వివాహం, పుత్ర భాగ్యం, లాటరీలో బహుమతులు, ఇంట్లో గొడవలు, అనారోగ్యాలు, అప్పుల సమస్యలు మొదలైన ఇబ్బందుల నుండి విముక్తి. ఆరోగ్యం విషయంలో విజయం, పోగొట్టుకున్న వస్తువులు దొరుకుట, ఇంట్లో సుఖ సంతోషాలు, ఇలా మీరు దిన దిన ప్రవర్ధమానంగా పురోభివృద్ధి చెందుతూ, అన్ని పనులలో విజయం సాధించేలా చేసే ఈ అద్భుత సిద్ధి ఉంగరం ఇప్పుడు మా ఆశ్రమ విశేష యజ్ఞం సందర్భంగా కొద్ది రోజుల వరకు ఉచితంగా పంపించబడుతున్నది. దీనిని కావాలనుకొనే వారు తమ పేరు, చిరునామా మరియు 1 నుండి 9 లోపల ఒక అంకెను మరియు మీ జన్మ దినాంక మరువకుండా మాకు తెలియజేయవలసిందిగా కోరుతున్నాం. మీరు సంప్రదించవలసిన చిరునామా

ADD PUJA ASHRAM (H)

PO KODERMA PIN - 825410 (J.H)